క్లుప్తంగా

రాంప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రముఖుల పరామర్శ



పెడన: కృష్ణా జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఉప్పాల రాంప్రసాద్ కుటుంబ సభ్యులను పలువురు ప్రముఖులు సోమవారం పరామర్శించారు. రాజ్యసభ సభ్యుడు, ఉమ్మడి కృష్ణాజిల్లా వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఉంగుటూరు జెడ్పీటీసీ దుట్టా సీతారామలక్ష్మి రాంప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం రాంప్రసాద్ తనయుడు రాము, రాము భార్య జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, సోదరులు నెహ్రూ, శ్రీనివాసరావులను పరామర్శించారు.

ఆలయానికి హుండీ బహూకరణ



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన యువకుడు బండ్రెడ్డి సుధాకర్ సోమవారం తన తండ్రి అంకాలరావు జ్ఞాపకార్థం హుండీని బహూకరించాడు. ఈసందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీహరి అర్చకత్వంలో తొలుత విశ్వేశ్వరునికి అభిషేకాలు, అన్నపూర్ణదేవికి విశేష పూజలు జరిపారు. అనంతరం రూ.20 వేలు విలువైన హుండీని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావుకు దాత అందచేశారు. పూషడపు సత్యవతి, సంధ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

జూలై 1న అరుణాచలానికి బస్ సర్వీస్

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం బస్టాండ్ నుంచి అరుణాచలానికి జూలై 1వ తేదీన సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డీఎం టి.పెద్దిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీన బయలుదేరి 2వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురంలోని దేవాలయాలు దర్శించుకుని, రాత్రి 11 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. 3వ తేదీన గిరి ప్రదక్షిణలు చేసిన అనంతరం బయలుదేరి 4వ తేదీ ఉదయం మచిలీపట్నం చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 99592 25462 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: కోడూరు మండలంలోని ఎక్స్‌ప్రెస్ లైన్‌కు సంబంధించిన మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. డామేజ్ కండక్టర్ స్థానంలో నూతన కండక్టర్లను అమర్చే పనులు చేపట్టడంతో వేణుగోపాలపురం, ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయతిప్ప గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

జగనన్న ఆణిముత్యాలు ప్రదానం



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలను ప్రదానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ టాపర్లను సన్మానించి, నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.దుర్గా రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

ఉత్తరపాలెం(మోపిదేవి): మండలంలో కె.కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని ఉత్తరపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలు దోనే స్వరూపరాణికి జనసేన పార్టీ నాయకులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఉదయం బాధితురాలిని పరామర్శించిన అనంతరం నగదుతో పాటు 26 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ సేవలు అభినందనీయం

- మున్సిపల్ అత్యవసర సమావేశంలో మంత్రి జోగి రమేష్
- చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి రాజీనామా ఏకగ్రీవంగా ఆమోదం



జ్యోత్స్నరాణి, గంగయ్య దంపతులను సన్మానిస్తున్న మంత్రి జోగి రమేష్ తదితరులు

పెడన: పట్టణాభివృద్ధికి మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి సేవలు అభినందనీయమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి అధ్యక్షతన సోమవారం జరిగింది. జ్యోత్స్నరాణి రాజీనామాను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఎక్స్‌ఆఫీషియో సభ్యుని హోదాలో సమావేశానికి హాజరైన మంత్రి జోగి రమేష్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. చైర్‌పర్సన్ పదవికి రాణి రాజీనామా చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే మడమ తిప్పం .. మాటకు కట్టుబడి సంక్షేమ ఫలాలను అందజేస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో పదవులను అనుభవించిన వారు సైతం మాటకు కట్టుబడి నడుచుకోవడం హర్షణీయమన్నారు. వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులు విలువలకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. కొందరు పనిగట్టుకుని గ్లోబల్ ప్రచారం చేశారని, అటువంటి వాటికి ఆస్కారం లేదన్నారు.

నూతన చైర్‌పర్సన్‌గా నాగకుమారికి అవకాశం

నూతన మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కటకం నాగకుమారి అవకాశం కల్పిస్తామని, ఎన్నికల నియామవళి ప్రకారం ఆ ప్రక్రియ త్వరలోనే జరుగుతుందని మంత్రి జోగి రమేష్ తెలిపారు. అలాగే మున్సిపల్ ఫ్లోర్‌లీడర్‌గా ఇప్పటి వరకు కటకం ప్రసాద్ కొనసాగారని, ఇక నుంచి బళ్ల గంగయ్య ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరిస్తారన్నారు. కరోనా సమయంలో కూడా పురప్రజల ఆరోగ్యం కోసం రాణి, గంగయ్యలు ధైర్యం చేసి ముందుకు వచ్చి అందించిన సేవలను మరువలేనివన్నారు. పెడనలో వనరులు తక్కువగా ఉన్న పురపాలక సంఘ నిధులు వెచ్చించడానికి అవకాశం లేక తన సొంత నిధులు ఖర్చుపెట్టిన ఘనత వారిదని మంత్రి వ్యాఖ్యానించారు. గతంలో పురపాలక సంఘ కార్యాలయాన్ని చూస్తే పాడుపడిపోయేలా కనిపించేదని, ఇప్పుడు ఎంతో ఆకర్షణీయంగా, సిబ్బందికి అన్ని వసతులు కల్పించేలా తీర్చిదిద్దారని కితాబు నిచ్చారు. కౌన్సిల్ హాలు రూపురేఖలు మార్చారన్నారు.

రూ.కోట్లతో అభివృద్ధి పనులు

మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి మాట్లాడుతూ తన పదవీ కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి జోగి రమేష్‌ల ఆశీస్సులతో పట్టణాభివృద్ధికి కృషి చేశానన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. మెగా వాటర్ స్కీమ్‌ను రూ.94 కోట్లతో ప్రారంభించామని, రూ.95 లక్షలతో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించామని చెప్పారు. తనకు సహకరించిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. తొలుత చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి సేవలను మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు కొసనం కరుణకుమారి, పిచ్చిక సతీష్‌బాబులు కొనియాడారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి, కౌన్సిలర్ గంగయ్య దంపతులను మంత్రి జోగి రమేష్, కౌన్సిల్ సభ్యులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ బి.మహేంద్ర, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో-2లు



ఎంపీడీవో శ్రీనివాసరావు నుంచి నియామక పత్రం అందుకుంటున్న రామారావు



డీవైఈవో సుబ్బారావుకు జాయినింగ్ రిపోర్టును అందజేస్తున్న ఎంఈవో-2లు

నాగాయలంక: రాష్ట్రంలో విద్యాశాఖను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో జిల్లాలో 53 మంది ఎంఈవో-2లకు పోస్టింగ్‌లు ఇవ్వగా నాగాయలంక మండల విద్యాశాఖ అధికారి-2గా అన్నపరెడ్డి రామారావు నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన స్వీకరించారు. ఎంఈవోగా నియమితులైన రామారావు ఇప్పటి వరకు మండలంలోని తలగడదీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పని చేశారు.

పెడన ఎంఈవో-2గా హరనాథ్

పెడన: పెడన మండల విద్యాశాఖాధికారి-2 వైవీ హరనాథ్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. పెడన మండలానికి ఇప్పటికే ఎంఈవో-1గా విధులు నిర్వహిస్తున్న మెటల్దారాణి ప్రస్తుతం దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. పెడనకు ఎంఈవో-1, ఎంఈవో - 2 పోస్టులు భర్తీ కావడం విశేషం. ఎంఈవో -1 పోస్టులోని మెటల్దారాణి సర్వీసు మేటర్లకు పర్యవేక్షించనున్నారు. ఎంఈవో-2గా బాధ్యతలను చేపట్టి వైవీ హరనాథ్ విద్యా సంక్షేమ పథకాలైన అమ్మ ఒడి, విద్యాకానుక జగనన్న గోరుముద్ద, నాడు నేడు పనులు పర్యవేక్షణ తదితర అంశాలను వాటిని పర్యవేక్షించనున్నారు. హరనాథ్ మచిలీపట్నం మండలం గుండుపాలెం జెడ్పీహెచ్ఎస్‌లో గ్రేడ్-2 హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ పెడనకు ఎంఈవో-2గా పదోన్నతిపై పెడనకు వచ్చారు. బాధ్యతలను స్వీకరించిన హరనాథ్‌కు సీఆర్పీలు అభినందనలు తెలిపారు.

మచిలీపట్నం డివిజన్‌లో..

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం డివిజన్‌లోని 12 మండలాల్లో నియామకం పొందిన ఎంఈవో-2



హరనాథ్

పోస్టులో అధికారులు సోమవారం విధుల్లో చేరారు. డీవైఈవో యూవీ సుబ్బారావును కలిసి జాయినింగ్ రిపోర్టులను అందజేశారు. నాగాయలంక మండలం ఎంఈవో -2 గా ఆ మండలంలోని తలగడదీవి జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఏ.రామారావు, బంటుమిల్లి మండలానికి కృత్తివెన్ను మండలం మాట్లం జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఏ.వెంకటేశ్వరరావు, కోడూరు మండలానికి గుడివాడ మండలం మోటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న వి.శ్రీనివాసరావు, మొవ్వ మండలానికి విజయవాడ రూరల్ మండలం నిడమానూరు జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న కె శ్రీలక్ష్మి నియమితులయ్యారు. అవనిగడ్డ మండలానికి కోడూరు మండలం లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ స్కూల్‌లో పనిచేస్తున్న ఏ.పిచ్చియ్య, ఘంటసాల మండలానికి మచిలీపట్నం మండలం తాళ్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఎండీ మొమిన్, పెడన మండలానికి మచిలీపట్నం గుండుపాలెం జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్న వైవీ హరనాథ్, మచిలీపట్నం రూరల్ మండలానికి కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్న వైఎస్ఆర్‌కె గురు ప్రసాద్, చల్లపల్లి మండలానికి మొవ్వ జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్న పి వెంకటేశ్వరరావు, కృత్తివెన్ను మండలానికి అదే మండలం రాళ్లరేవు జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్న ఎస్‌కెడీవీ ప్రసాదరావు, గూడూరు మండలానికి మైలవరం జెడ్పీ స్కూల్‌లో పనిచేస్తున్న పి.సుబ్రహ్మణ్యం, మోపిదేవి మండలానికి అక్కడే ఎంఈవోగా పనిచేస్తున్న కె.రాజ్‌కుమార్ ఎంఈవో-2 గా బాధ్యతలు స్వీకరించారు.

చల్లపల్లి ఎంఈవో -2 గా వెంకటేశ్వరరావు

చల్లపల్లి: తాజా నియామకాల్లో చల్లపల్లి మండల నూతన ఎంఈవో-2గా పరిశె వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. మొవ్వ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై చల్లపల్లి ఎంఈవోగా నియమితులయ్యారు.

ఈ సందర్భంగా స్థానిక ఎంఈవో కార్యాలయంలో వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు ఆయనకు స్వాగతం పలికి, సత్కరించారు.

గృహ నిర్మాణానికి శంకుస్థాపన



గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ షాహీనా

మచిలీపట్నంటౌన్: నగరంలోని 28వ డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులు జగనన్న లేఅవుట్‌లోని హెచ్ బ్లాక్‌లో సోమవారం గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ షేక్ షాహీనా, డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్‌సాహెబ్ లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ షాహీనా మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రజలకు జగనన్న కాలనీ హెచ్ బ్లాక్‌లో స్థలాలు కేటాయించామన్నారు. వీరంతా ఈ ప్లాట్లలో గృహాలు నిర్మించుకునేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రూ.1.80 లక్షల ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై వలంటీర్లకు దిశానిర్దేశం



జింజేరు గ్రామ సచివాలయంలో దిశానిర్దేశం చేస్తున్న సచివాలయ సిబ్బంది

పెడన: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వలంటీర్లకు సచివాలయ ఉద్యోగులు దిశానిర్దేశం చేశారు. ఎంపీడీవో వి.రెడ్డయ్య ఆదేశాలతో మండలంలోని 17 గ్రామ సచివాలయాల్లో వలంటీర్లతో అత్యవసర సమావేశాలను సోమవారం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను అందని అర్హులను గుర్తించి వారికి ఆ ఫలాలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకాలు అందని వారి వివరాలను నమోదు చేయడంతో పాటు వలంటీర్ సెల్ ఫోన్‌లో జియో ట్యాగింగ్ చేయాలని తెలిపారు. పథకాలందని వారితో ప్రత్యేకంగా ఒక క్యాంపు నిర్వహించి అప్పటికప్పుడు పరిష్కరం తీసుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని సచివాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఎంపీడీవో రెడ్డయ్య, ఈవోపీఆర్డీ జయరాంలు పర్యవేక్షించారు.

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి కల్పించాలి



నాగాయితిప్ప గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

నాగాయితిప్ప(మోపిదేవి): జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని నాగాయితిప్ప గ్రామ సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి) అన్నారు. మండల పరిధిలోని నాగాయితిప్ప గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మజ్ను మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ పరిధిలో 2022-23 సంవత్సరానికి జరిగిన ఉపాధి పనులపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాల నివేదికను చదివి వినిపించారు.

గ్రామంలో వచ్చిన సమస్యలు స్వీకరించినట్లు ఏపీవో తెలిపారు. మోపిదేవిలంక సర్పంచ్ మోర్ల జ్యోత్స్న, ఎస్ఆర్పీ నందినీ, డీఆర్పీలు బాబూరావు, రమేష్, టీఏ హరిబాబు నాయక్, గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి, వీఆర్వో గోపాలకృష్ణ, ఎఫ్ఏలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

గుడివాడటౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి మూడు దరఖాస్తులు వచ్చాయన్నారు. స్థానిక 25వ వార్డుకు చెందిన ఎస్ జగదీష్ తమ ప్రాంతంలో రోడ్డు నిర్మించాలని, 7వ వార్డుకు చెందిన ఎస్. ప్రభాకరరావు మూసివేసిన తన స్క్రాబ్ షాప్ తిరిగి ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని, 24వ వార్డుకు చెందిన ఎం.మణిదీప్ స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద టీ షాప్‌తో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని ఫిర్యాదు చేశారు. పెదపారుపూడి మండలం నాగాపురం గ్రామంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని ఆర్డీవో కార్యాలయంలో గ్రామస్తుడు ఫిర్యాదు చేశారు.

సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

చిలకలపూడి(మచిలీపట్నం): సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం కెడీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురాం మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతుల భాగస్వామ్యంతో పనిచేస్తున్న సహకార సంఘాలు ప్రైవేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ చేసిన సవరణ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. జీవో నెంబర్ 36, 90ల ప్రకారం వేతనాలు అమలు చేయాలని 2016 ఏప్రిల్ 1వ తేదీ నుంచి మానిటరీ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.కొండాలశర్మ, కెవీ రవికుమార్, భోగాది శ్యాం ప్రసాద్, డి.విజయకుమార్, జన్యావుల రామాంజనేయులు, టీపీఎస్ హనుమంతరావు, పి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం కెడీసీసీ బ్యాంక్ సీఈవో శ్యామ్‌మనోహర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



గుడివాడటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ పట్టణ విభాగం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్ మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గ ప్రజలు శ్మశానవాటిక స్థలం లేక నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి ఐదు ఎకరాల భూమి కొనుగోలుకు నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే నానికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, మైనార్టీ సెల్ నాయకులు వెంపటి సైమన్, మామిళ్ల ఎలీషా, విక్టర్‌పాల్, విలియం జోషి, బూసి ప్రకాష్, మెండా రవి, జాలాది ప్రభాకర్, పసలాది ఏసుబాబు, శ్యామ్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాలకు మేలు

- ఎమ్మెల్యే రమేష్‌బాబు
- అశ్వారావుపాలెంలో ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేసి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండల పరిధిలోని అశ్వారావుపాలెంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రతి గడపకు చేరుతున్నాయని, విద్య, వైద్యానికి జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది ఉద్యోగాలు కల్పించారని తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని వారు స్థానిక సచివాలయంలో సంప్రదిస్తే వెంటనే పథకాలను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే సింహాద్రి చెప్పారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ షేక్ నజీర్, పట్టణ పార్టీ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాసు, గ్రామ కన్వీనర్ దాసినేని భాగ్యరాజ్, సచివాలయ కన్వీనర్ దాసినేని గోపాలకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ గాజుల జైగోపాల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన సాగిస్తున్నామని ఆ పార్టీ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని కానూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కిట్టు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ సమస్యలపై ఆరా తీశారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పెన్షన్ల మంజూరు, పంపిణీ విషయంలో లబ్ధిదారులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు. వెంటనే ఆ ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నదీలేనిదీ అడిగి తెలుసుకున్నారు. బొమ్మిడి సత్యనారాయణమ్మ అనే మహిళ కిట్టుతో తమ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ అన్ని ప్రభుత్వ పథకాలు అందాయని తెలిపింది. ఏడాదిలో దాదాపు రెండు లక్షల రూపాయల వరకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిందని ఆనందాన్ని వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ పుణ్యమా అంటూ ఆర్థిక సమస్యలు లేవని, వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావటం ఖాయమని ధీమా వ్యక్తం చేసింది. వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కిట్టు కోరారు. తప్పకుండా నిలబడతామంటూ ఆమె మరోసారి భరోసాను ఇచ్చింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెక్కా లక్ష్మి, ఇన్‌చార్జి చెక్కా ఏడుకొండలు, ఉపసర్పంచ్ గోపు మురళీ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు చూడామణి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'స్పందన'కు అధికారుల డుమ్మా



స్పందనకు హాజరైన ఇన్‌చార్జి ఎంపీడీవో పాండురంగారావు

కోడూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి మండలాధికారులు డుమ్మా కొట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి కేవలం ఒక్క అధికారి మాత్రమే హాజరయ్యారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని శాఖలాధికారులు తప్పనిసరిగా స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశాలు ఉన్నప్పటికీ మండలాధికారులు వీటిని పూర్తిగా విస్మరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో పాండురంగారావు మినహా ఇచ్చి మిలిగిన అధికారులు కార్యక్రమానికి హాజరు కాలేదు.

15 శాఖలాధికారులు విధులు నిర్వహిస్తుండగా కేవలం ఎంపీడీవో మాత్రమే కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్పందనకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంటే మండలాధికారులు ఈ విధంగా వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు. జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకొని స్పందన కార్యక్రమానికి అన్ని శాఖలాధికారులు విధిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి విశేష కృషి

- జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న పేర్ని కిట్టు, నాయకులు

కోనేరుసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. మండల పరిధిలోని పెదపట్నం గ్రామంలో రూ.25 లక్షలతో చేపట్టనున్న పంచాయతీ అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి మూల గ్రామానికి అన్ని రకాల సదుపాయాలు సమకూర్చాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఆ దిశగా ఆయన గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూరుస్తూ పల్లె ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రూ.13 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణంతో పాటు మరో రూ.5 లక్షల వ్యయంతో మంచినీటి సంపు నిర్మాణం, అలాగే కల్వర్టు నిర్మాణానికి మరో రూ.5 లక్షలు ఖర్చు చేసి నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తుల నుంచి వచ్చిన అర్జీలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించిన బందరు శాసనసభ్యుడు పేర్ని నానికి పెదపట్నం గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నామని గ్రామ సర్పంచ్ గడిదేశి అనూష తెలిపారు.

కార్యక్రమంలో కెడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గడిదేశి చినవెంకయ్య, ఇన్‌చార్జి గడిదేశి రాజు, గ్రామ కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.